కథానిక

# ఫస్ట్ లవ్

— శివాజీప్రసాద్

ఫ్రమ్ అడ్రస్ చూసి ఆ ఉత్తరం ఎవరు వ్రాసిందీ పోల్చుకోలేకపోయాను కాస్సేపు. ఆ పేరుతో మనస్సులో ఎంతో పరిచయం వున్నప్పటికీ ఆ ఉత్తరం "తన" దగ్గర నుంచే అనుకోవడానికి నా మనస్సు తటపటాయించింది. ఆశపడితే అంత అదృష్టం దక్కదేమోనని. అయితే అదృష్టవశాత్తూ ఆ ఉత్తరం వచ్చింది 'విజయ' దగ్గర నుంచే.

నేను బి.కాం. ఫైనల్ ఇయర్‌లో వుండగా విజయ బి.యస్సీలో జేరింది. ఒకరోజు ఏదో కారణంతో మా కాలేజిలోని క్లాస్‌లన్నీ బాయ్‌కాట్ చేయిస్తున్నాము. నా వంతుగా నేను బియస్సీ ఫస్ట్ ఇయర్ క్లాస్‌లోకి వెళ్ళి వారిని కూడా బాయ్ కాట్ చేయవలసిందిగా కోరుతున్నాను. అప్పుడే మొదటిసారిగా విజయను చూడడం తటస్థించింది. ఆ ఖంగారులో తను నాకు లీలగా, అస్పష్టంగా కనిపించింది. అంతే! తనలోని ఏదో తెలీని ఆకర్షణాశక్తి నా గుండెల్ని లాగి పిండేస్తున్నట్టూ వింతైన, తీయని అనుభూతి. అది లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అయినా కావచ్చు – ఎడ్రినాలిన్ హార్మోన్ ప్రభావమైనా కావచ్చు. ఏది ఏమైనప్పటికీ ఆ క్షణం నుంచీ నా లోకమే మారిపోయిందన్నట్టూ ఫీల్ అయ్యాను. అలా మొదలైంది నా జీవితంలో తొలిప్రేమ ఘట్టం.

విజయ ఆకర్షణా ప్రభావంలో నా కాలేజి రోజులు ఎంతో అద్భుతంగా గడిచాయి. రోజూ ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు కాలేజికి వెళ్దామా అని ఎదురుచూసేవాడిని. ఎప్పుడైనా శలవు వస్తే చాలు – నా జీవితంలో ఒకరోజు వృధా అయిపోతుందనిపించేది... విజయ కనిపించదు కాబట్టి.

విజయతో పరిచయం చేసుకోవాలనీ, మాట్లాడాలనీ తహతహలాడేవాడిని. పెదాలు కదిలేవి కావు. తను కబడితే చాలు – నా గుండె చప్పుళ్ళు అధికమయ్యేవి. తను తిరిగే దారులలోనే తిరిగేవాడిని. ఎదురు పడగానే నా అడుగులు తడబడేవి. నా ప్రవర్తన నాకే వింతగా అనిపించేది.



విజయతో పరిచయం చేసుకునేందుకు ఎన్నోసార్లు వాళ్ళ క్లాస్ దాకా వెళ్ళాను. అయినా ధైర్యం చాలేది కాదు. "ఈ రోజు కాదు – రేపు మాట్లాడాలి" అనుకుంటూ నా మనస్సు నన్ను వెనక్కు లాగేది. ఇంటికి వచ్చి ఎలా పరిచయం చేసుకోవాలో రిహార్సల్స్ వేసుకునేవాడిని – అద్దం ముందు నుంచుని. కానీ మరుసటి రోజు మళ్ళీ మామూలే. ఇలా రిహార్సల్స్‌తోనూ, వృధా ప్రయత్నాలతోనూ నా ఫైనల్ ఇయర్ మొత్తం గడిచిపోసాగింది. ఇక నెల రోజుల్లో కాలేజి శలవులకి మూసేస్తారనగా – ఒకరోజు కాలేజికి వెళ్తున్న దారిలో విజయ తారసపడింది. ఎలాగైతేనేం, ధైర్యం చేసి... నా ఆటోగ్రాఫ్ పుస్తకం ఇచ్చాను. ఏదైనా మెస్సేజ్ వ్రాయమని.

"అంత వెంటనే వ్రాయాలంటే ఏం వ్రాయాలో నాకు తోచడం లేదు. మీకు రేపు ఇస్తాను" అంటూ నా ఆటోగ్రాఫ్ పుస్తకం తన బ్యాగ్‌లో పెట్టుకుంది. అదే మా పరిచయానికి అంకురార్పణ. ఇక నా ఆనందానికి అవధులు లేవు. ఈ లోకమంతా ఎంతో ఆహ్లాదంగా కన్పించసాగింది. నా చుట్టూ వున్న మనుషులందరికన్నా నేను ఎంతో ఎత్తుకు ఎదిగిపోయాననిపించింది.

ఆ తరువాత నెల రోజులూ ఇద్దరం అప్పుడప్పుడూ కలుసుకునేవాళ్ళం– కల్చరల్ అసోసియేషన్

○○

ప్రేమ కలలోంచి పుదుతుందా? కన్నీటి మరకగా మారుతుందా?

ప్రేమ తీపి జ్ఞాపకంగా మారడం వెనుక విషాద నేపద్యం ఏమిటి?

○○




వుణ్యమా అని. ఎంతో మాట్లాడాలని వున్నా బిడియంతో ఏమీ మాట్లాడలేకపోయేవాణ్ణి. విజయ మాత్రం అరమరికలు లేకుండా కలువుగోలుగా వుండేది. తన నడకలోని ఠీవి, నవ్వులో స్వచ్ఛత, ప్రవర్తనలో హుందాతనం – ఇవి ఎప్పటికైనా నాకు సాధ్యమేనా అనిపించేది.

నా డిగ్రీ పూర్తయి, పై చదువులకై నేను హైదరాబాద్ వెళ్ళిపోయాను. అక్కడ నుండి మూడేళ్ళకి ఢిల్లీలో ఉద్యోగం రావడంతో ఆంధ్ర రాష్ట్రాన్ని కూడా వదిలి పెట్టవలసి వచ్చింది. ఈలోగా విజయ మెడిసిన్‌లో జేరింది. మా ఇద్దరి మధ్యా ఉత్తరాలద్వారా స్నేహం కొనసాగుతూనేవుంది. ఢిల్లీలోని నా ఒంటరి జీవితానికి తన నుంచి వచ్చే ఉత్తరాలు ఎంతో ఊరట కలిగించేవి.

ఒకసారి చొరవ తీసుకుని నేనే విజయకు మా ఇద్దరి పెళ్ళి విషయమై ప్రపోజ్ చేశాను. మాట్లాడడానికి అడ్డు వచ్చే బిడియం ఉత్తరాలకి అడ్డురాలేదు. అయితే అప్పటి నుంచీ విజయ నుంచి ఉత్తరాలు రావడం తగ్గింది. వచ్చినా అందులో ఇదివరకటి ఇంటిమసీ వుండేది కాదు.

మరుచటి సంవత్సరం నేను ఢిల్లీ నుంచి ఆంధ్రకు వచ్చాను. వచ్చిన వెంటనే 'విజయ' ఇంటికి వెళ్ళాను. వాళ్ళ అమ్మగారి ద్వారా విజయ పెళ్ళి కొద్ది నెలల క్రితమే ఓ డాక్టర్‌తో జరిగిందని తెలిసింది. ఆ విషయం విని నిలువునా నీరు కారిపోయాను. ఈ లోకంతో నాకిక పని లేదనిపించింది. బ్రతుకు దండగ అనిపించింది. అలా నిరాశా, నిస్పృహలతోనే ఢిల్లీకి చేరుకున్నాను. తన పెళ్ళికి ముందు విజయ వ్రాసిన ఉత్తరం అప్పుడే అందింది నాకు. ఆలస్యంగా. అది చదివేక గానీ నేను మళ్ళీ మామూలు మనిషిని కాలేకపోయాను. నాకన్నా చిన్నదైనప్పటికీ జీవితంపట్ల, కెరీర్‌పట్లా తనకున్న అవగాహనకు చాలా సంతోషించాను. ఆ ఉత్తరం స్ఫూర్తిగా, అప్పటి నుంచీ నా ఉద్యోగంలో వున్నత స్థానాన్ని పొందడానికి ప్రయత్నాలు ప్రారంభించాను.

నా జీవితంలో మరో వ్యక్తి ప్రవేశించి ఆమెతో నా వివాహం జరిగింది. ఇద్దరమూ సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నాము. నా ఆఫీస్‌లో మంచి పేరు, సమాజంలో కొంత గుర్తింపూ సాధించాను. అలా మామూలుగా గడిచిపోతున్న ఈ జీవితంలో – విజయ నుంచి వచ్చిన ఉత్తరం కొత్త ఊపిరి పోసింది. జ్ఞాపకాల తలుపులు తెరిచింది.

మా ఇద్దరికీ తెలిసిన మరో స్నేహితుడి ద్వారా నా అడ్రస్ తెలిసిందట. ఈ వూరి మీదుగా వెళ్తూ వీలయితే ఓసారి కలవమని, రైల్వేస్టేషన్‌కు రావల్సిందిగా వ్రాసింది.

ఆరోజు రైల్వేస్టేషన్‌కు బయలుదేరాను. సుమారు ముప్పై ఏళ్ళ తర్వాత మళ్ళీ విజయను చూడబోతున్నానన్న ఆలోచన అద్భుతంగా వుంది. స్టేషన్‌కు వెళ్ళానన్న మాటే గానీ ఎక్కడా ఓ క్షణం పాటూ నిలవలేకపోయాను. ఏదో ఆతృత. తనను కలవబోయే క్షణం కోసం ఆరాటం. నా కళ్ళకి అది రైల్వేస్టేషన్‌లా కనిపించడం లేదు. నా మనస్సు కాన్వాస్‌పై మా కాలేజి చిత్రీకరించబడింది. ఆ యవ్వనపు తొలి రోజులలో పుట్టిన ఆకర్షణ తిరిగి మొలకెత్తింది. గుండెదడ అది వరకు మాదిరి మొదలైంది.

ఇంతలో ట్రైన్ వచ్చింది. జనం రద్దీ ఎక్కువగా వుంది. అటూ, ఇటూ ఆదుర్దాగా వెతుకుతూ తిరిగాను. కానీ ఎక్కడా విజయ కన్పించలేదు. చివరి బోగీ నుంచి మళ్ళీ ఓసారి చూసుకుంటూ వద్దామని వెనక్కు తిరిగేటంతలో 'ప్రసాద్' అంటూ నా వెనకే ఎవరో పిలిచినట్టయ్యింది. ఒక్కసారిగా వెనక్కు తిరిగాను. అదే విజయ!!!

వయస్సు ప్రభావంతో జుట్టు కొద్దిగా నెరిసింది. నా ఊహల్లోని 'విజయ'కూ వాస్తవంలోని ఈ విజయకూ రూపంలో ఎంతో మార్పు. నా మనస్సులో ముద్రించుకు పోయిన తన రూపం చెక్కు చెదరకుండా అలానే వుండి వుంటే బావుణ్ణనిపించింది – ఓ క్షణం పాటు...

ఇద్దరమూ కంపార్ట్‌మెంట్‌లో కూర్చున్నాము. ట్రైన్ ఇంకో అరగంటసేపు ఇక్కడే ఆగి వుంటుంది. మా కాలేజి కబుర్లతో కాలం ఇట్టే గడిచిపోయింది. అంతలో విజయ తన పర్స్‌లోంచి ఓ కాగితం తీసి నాకు ఇచ్చింది. ఆ రోజుల్లో తన కోసం నేను వ్రాసిన ఓ వచన కవిత అది. భావానికి ప్రాధాన్యత లేకుండా అంత్యప్రాసలతో వ్రాసిన ఆ వచనాన్ని చూసి నాకే చిన్నతనమనిపించింది. నా మొహంలో ఫీలింగ్స్‌ని చదివింది కాబోలు – అది నేను ఎక్కడ చింపేస్తానో అన్నట్టూ గభాలున ఆ కాగితాన్ని లాక్కుని తన పర్స్‌లో దాచేసింది – అపురూపంగా.

నేను పాత ఆటోగ్రాఫ్ పుస్తకం తీసి చూపించాను. ఆ రోజు సంఘటన గుర్తు తెచ్చుకుని ఇద్దరం హాయిగా నవ్వుకున్నాము. ఇంతలో రైలు కదలబోతున్నట్టుగా మైక్‌లో అనౌన్స్‌మెంట్. నేను కంపార్ట్‌మెంట్ దిగి ప్లాట్‌పారం మీద కిటికీ దగ్గర నుంచున్నాను.

"జీవితంలో ఎప్పటికయినా నిన్ను ఒక్కసారైనా కలవాలని అనుకునేదాన్ని – ఓ విషయం చెప్పాలని" అంది విజయ.

ట్రైన్ నెమ్మదిగా కదలనారంభించింది.

"ఏమిటి?" ఆతృతగా అన్నాను.

"ఇన్ ఫాట్యుయేషన్‌కీ, ప్రేమకీ నీకు తేడా తెలీదనుకున్నాను. నన్ను ఇంతగా ప్రేమించినందుకు చాలా థ్యాంక్స్." తన కళ్ళలో సన్నటి కన్నీటి పొర. వీడ్కోలుకు సూచనగా–

ట్రైన్‌తోపాటూ ముందుకు నడుస్తూ అసంకల్పితంగా నా చేతిని తనకి అందించాను షేక్‌హాండ్ ఇస్తున్నట్టూ. నా చేతిని అందుకుని సుతారంగా నొక్కి మెల్లిగా వదిలింది. శరీరమంతా జివ్వుమన్నట్టూ ఏదో అద్భుత శక్తి నా వంట్లోకి పాకినట్టూ అనుభూతి.. అదే స్పర్శ.. దానికి వయసు రాలేదు.

ట్రైన్ కనుమరుగయ్యాక బయటకు వచ్చాను. ఆ స్పర్శతో ఏదో తెలీని శక్తి నా నరనరాల్లోనూ పాకి నన్ను సరికొత్త మనిషిని చేసినట్టూ వుంది. పార్కింగ్‌లోంచి కార్‌తీసి ఇంటి వైపుపోనిస్తూ, వ్యూ ఫైండర్‌లో చూసుకున్నాను. నా మొహంలో సంతోషం ఎలా కనిపిస్తోందోనని. నెరసిన నా జుట్టు కూడా ఆనందంతో ఎగురుతోంది. అన్ని అనుభవాల మాదిరే ఈ అనుభవం కూడా ఓ పిల్ల తెమ్మెరలా వెళ్ళిపోయింది. తీయని జ్ఞాపకాన్ని మిగిల్చి.